యూరియా కోసం పడిగాపులు

- ఎరువుల దుకాణాల వద్ద ఆశగా ఎదురుచూపులు
- యూరియా కొరతకు కారణం కూటమి ప్రభుత్వమే అని విమర్శలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమృద్ధిగా యూరియా
- ప్రైవేటు డీలర్లకు అప్పగించడం వల్లే కొరత


కంచికచర్ల గ్రోమోర్ ఎరువుల దుకాణంలో పాస్‌బుక్‌లు, ఆధార్ నమోదు చేయించుకుంటున్న రైతులు

కంచికచర్ల: కంచికచర్లలో యూరియా కోసం రైతులు ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నారు. కట్ట యూరియా అయినా దొరికితే చాలని ఎరువుల దుకాణాల వద్ద ఆశతో ఎదురు చూశారు. గత ప్రభుత్వంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులు నేరుగా యూరియా కొనుగోలు చేసేవారు. యూరియా కొరత అనేది లేకుండా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంది. కూటమి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన పెసర పంట వర్షం కురవటంతో చేతికి రాకుండా పోయింది. కనీసం ఒక్క గింజ కూడా కొంతమంది రైతులు ఇళ్లకు చేరలేదు. వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలను కాపాడుకుందామనుకుంటే యూరియా ఎరువులు అందుబాటులో లేకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కంచికచర్లలో యూరియా కోసం ఎరువుల దుకాణాల వద్ద శుక్రవారం రైతులు పడిగాపులు కాశారు. కనీసం రెండు బస్తాల యూరియా అయినా దొరుకుతుందేమోనని వేచి చూసిన రైతులకు నిరాశే మిగిలింది. స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద 50 మంది రైతులు యూరియా కోసం వేచి చూసారు. ఎరువుల దుకాణంలో కేవలం ఐదు టన్నులు మాత్రమే యూరియా ఉండటంతో వారికి అనుకూలమైన రైతులకు పంపిణీ చేశారని సమాచారం. డిమాండ్ మేరకు యూరియాను కూటమి ప్రభుత్వం సరఫరా చేయలేకపోయిందని రైతులు విమర్శిస్తున్నారు.

అధిక ధరలకు ప్రైవేటు డీలర్ల విక్రయాలు

రైతులకు అవసరమైన యూరియాను ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించకుండా ప్రైవేటు డీలర్లకు అప్పగించారు. సొసైటీల ద్వారా అయితే ఒక్కో బస్తా యూరియా రూ.267లకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద మాత్రం ఒక్కో బస్తా యూరియా రూ.400 నుంచి రూ.500 చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు దుకాణల డీలర్లు బ్లాక్‌లో ఎరువులను విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుకు సకాలంలో యూరియాను సరఫరా చేయలేని ప్రభుత్వం ఎందుకు అంటూ రైతులు ధ్వజమెత్తుతున్నారు.

సాగు విస్తీర్ణం ..

నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో 22,530 హెక్టార్లలో పలు రకాల పంటలను సాగుచేశారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, నువ్వులు, జొన్న, కందులు, పెసర, మినుము, సోయాబీన్ తదితర పంటలు సాగుచేశారు. నాలుగు మండలాల్లో వరి 3,116 హెక్టార్లు, మొక్కజొన్న 3,651 హెక్టార్లు, పత్తి 11,747 హెక్టార్లు, మినుము 757 హెక్టార్లు, పెసర 2,868 హెక్టార్లలో రైతులు సాగుచేశారు. మిగిలిన పంటలైన కంది, సోయాబీన్, జొన్న పంటలను కూడా సాగుచేశారు. కంచికచర్ల మండలంలో 7,395 హెక్టార్లు, నందిగామ మండలంలో 4,324 హెక్టార్లు, చందర్లపాడు మండలంలో 5,380 హెక్టార్లు, వీరులపాడు మండలంలో 5,431 హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగుచేశారు. డిమాండ్ ఆరువేల టన్నులు..

6 వేల టన్నులు అవసరం కాగా 3వేల టన్నుల కేటాయింపు

నందిగామ సబ్ డివిజన్‌లో రైతులకు ఆరు వేల టన్నుల యూరియా కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 3 వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని నందిగామ సహాయ వ్యవసాయ అధికారి ఐకే శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే వచ్చిన యూరియా నిల్వలు అయిపోయాయని, మరో రెండు రోజుల్లో 1,200 టన్నుల యూరియా నందిగామకు రానుందని, ఇంకా 1,700ల టన్నుల యూరియా రావాల్సి ఉందని ఏడీఏ తెలిపారు.

ప్రభుత్వానిదే బాధ్యత


ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ప్రభుత్వం అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలి. కూటమి ప్రభుత్వం యూరియా కొరతను సృష్టించింది. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం యూరియాను రైతులకు అందించలేకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– రాయల నరసింహారావు, రైతు, మున్నలూరు, కంచికచర్ల మండలం

ప్రైవేటు డీలర్లకు అప్పగించారు


గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో యూరియాకు కొరత అనేది లేదు. రైతుకు ఎప్పుడు కావాలంటే అప్పుడు యూరియా అన్ని దుకాణాలు, సొసైటీల్లో దొరికేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కొరత ఏర్పడింది. ఇప్పటికే వర్షాల వల్ల సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. ఉన్న పంటలను కాపాడుకోవాలంటే యూరియా తప్పకుండా ప్రభుత్వం అందించాలి.

– గుదే సాంబశివరావు రైతు, గొట్టుముక్కల, కంచికచర్ల మండలం

క్లుప్తంగా

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ హెచ్చరిక



మక్కపేట(వత్సవాయి): సొసైటీ ద్వారా రైతులకు యూరియా పంపిణీ ప్రక్రియను నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. సొసైటీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 222 బస్తాలు వచ్చాయని వారు తెలిపారు. రైతుకు ఒక్క కట్ట మాత్రమే అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ యూరియా, డీఏపీకి బదులు నానో యూరియా, డీఏపీలను వాడుకోవాలని సూచించారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియాను అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ జి. సత్యనారాయణ, సర్పంచ్ మల్లెల శివ, సొసైటీ అధ్యక్షుడు సత్తి బేతోలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా స్థానిక కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, పేద మహిళలకు, వయోవృద్ధులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. దేచు రామచందర్ సహకారాన్ని అందించగా, శ్రేయస్సు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పెనుగంచిప్రోలు గ్రామంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వెంకటకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ మహిళకు కేటాయించాలి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ రాష్ట్ర నాయకులు కోట డానియల్, జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాతంగి దావీదు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



వీరులపాడు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఏకత్వ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని కిలారు ధరణిశ్రీ ఎంపికైందని పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్ తెలిపారు. పొన్నవరం గ్రామంలోని పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థినిని ఆయన ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్, కార్తిక్, జ్యోతి, పీడీ గోగులమూడి విజయ్‌కుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు నివాళి
- గురువులకు ఘన సన్మానాలు

నందిగామ టౌన్/ జగ్గయ్యపేట: సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు, కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని చెప్పారు. వారిని గౌరవించడం అందరి బాధ్యత అని చెప్పారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి అభినందించారు.

- **నందిగామ టౌన్:** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను సత్కరించడం సంతోషంగా ఉందని వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొప్పు మురళీకృష్ణ పేర్కొన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అనాసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించి విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు, బిస్కట్‌లను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు ఏచూరు రాము, కేతేపల్లి వెంకటసాయి పవన్, సముద్రాల రమేష్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తేజ డీవీఆర్ కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


పెనుగంచిప్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న తల్లులు

నందిగామ రూరల్‌లో..

తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దైవంతో సమానంగా పూజించడం మన సాంప్రదాయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అన్నారు. పట్టణంలోని తేజ డీవీఆర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం

పెనుగంచిప్రోలు: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలోని 6, 12 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సువర్చల, రాజేశ్వరిలను చిన్నారుల తల్లులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల హెల్పర్స్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

- **కంచికచర్ల:** లయన్స్ క్లబ్ ఆఫ్ కంచికచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. లయన్స్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు మాట్లాడుతూ గురువుల సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నంబూరు పెదబాబు, బచ్చు రంగారావు, టి. వెంకటప్పయ్య, జూలూరు గంగాధర్, ఎంఎస్ఆర్‌బీ ప్రసాద్, పెద్దినీడి కోటేశ్వరరావు, సానె రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన్ స్కూల్ అధినేత గంగిరెడ్డి రంగారావును స్థానిక పాత్రికేయులు సత్కరించారు. కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. కళాశాల అధినేత కేవీ కృష్ణారావును, అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు.

అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో...

పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కె. రామ్మోహనరావు కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్, అన్ని విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి నివాళి..

నందిగామ టౌన్: విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న గురువులను గౌరవించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణ సేవలను కొనియాడారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు చిలుకూరి బుచ్చిరెడ్డి, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీను, ఓర్సు కొండ, పోతురాజు, బుగ్గినేని సురేష్, గాడిపర్తి రామకృష్ణ, మాడుగుల నాగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.


కంచికచర్లలో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


విజ్ఞాన్ స్కూల్ అధినేత రంగారావును సత్కరిస్తున్న దృశ్యం



పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో..


నందిగామ పార్టీ కార్యాలయంలో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న జగన్‌మోహనరావు

ఉత్సాహంగా వినాయక నిమజ్జనాలు


వత్సవాయి నిమజ్జన కార్యక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న తన్నీరు నాగేశ్వరరావు


పెనుగంచిప్రోలు బురుజు సెంటర్‌లోని గణనాథుని ఊరేగింపు

వత్సవాయి: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి, ముక్త్యాల గ్రామాల వద్ద కృష్ణానదిలో నిమజ్జనాలు చేశారు. వత్సవాయిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. నిమజ్జనాల సందర్భంగా పోలీస్‌వారు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, రూప్లానాయక్, మిట్టకోలు నరేష్, మండవ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు

నందిగామ రూరల్: మండలంలోని వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన గణనాథులకు శుక్రవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గాంధీ సెంటరు, వాసవీ మార్కెట్, ముక్కోటి మహా మండపంలోని బొజ్జ గణపయ్యలను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, మూలమంత్ర హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు.

- **పెనుగంచిప్రోలు:** పెనుగంచిప్రోలుతో పాటు పలు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి మునేరులో నిమజ్జనం చేశారు. కొన్ని మండపాల వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

గణనాథునికి ఏసీపీ పూజలు..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలోని గణనాథులకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పెద్దాపురం గ్రామంలోని శివాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని నందిగామ ఏసీపీ తిలక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ అనిల్, గ్రామ నాయకులు నిమ్మల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- **జగ్గయ్యపేట అర్బన్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలో శుక్రవారం పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, భజనలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బంగారు కొట్ల సెంటర్‌లోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శ్రీసిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి వారి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివార్లను, దేవేరిలను అలంకరించారు. వివిధ మండపాల్లో కొలువైఉన్న స్వామివార్లను అట్టహాసంగా ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకువెళ్లారు.


పెద్దాపురంలో గణనాథునికి పూజలు చేస్తున్న ఏసీపీ

ప్రవక్త బోధనలు ఆచరణీయం

- ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు
- ఈద్ ముబారక్ చెప్పిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మహ్మద్ ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమైనవని, ముఖ్యంగా మానవ జీవన గమనాన్ని శాంతి, ధర్మ మార్గంలో నడిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలతో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తొలుత ముస్లింలను ఆత్మీయంగా పలుకరిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ మిలాద్–ఉన్–నబీ ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక ఎదుగుదల, సుఖం, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని మక్కా మసీదులో నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముతవల్లి మహమ్మద్ ఖాజా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు షేక్ మున్నా, షేక్ యాకుబ్ అలీ, షేక్ సైదా, రజ్వీ, షేక్ జాఫర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మిలాద్–ఉన్–నబీ ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: మిలాద్–ఉన్–నబి వేడుకలు పట్టణంలో శుక్రవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. కాగితాల బజారులోని రజా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మసీదు కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొని మిలాద్–ఉన్–నబి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ర్యాలీలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు

మిలాద్–ఉన్–నబి సందర్భంగా ముస్లింలు నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, ధర్మ చింతన ప్రతి మానవుడిలో ఉండాలని చెప్పిన మహ్మద్ ప్రవక్త బోధనలు, సూక్తులు, సూచించిన ధార్మిక విషయాలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పార్టీ 17 వ వార్డు అధ్యక్షుడు షేక్ ఖాదర్, షేక్ ఖాదర్‌బాబు, మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.


నందిగామలో ముస్లింల ర్యాలీలో పాల్గొన్న జగన్‌మోహనరావు


నందిగామలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహనరావు


పేటలో ర్యాలీలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు


జుజ్జూరులో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

- **వీరులపాడు:** మండలంలోని ఆయా గ్రామాల మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. జుజ్జూరు గ్రామంలో గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ప్రతి ఒక్కరు కలిసి మెలిసి జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు షేక్ చిన్నమీరా హుస్సేన్, షేక్ ఖాజా పీరా, షేక్ మహ్మద్ రజియా, నాగుల్‌మీరా, తాజుద్దీన్, షేక్ ఖాజా, షేక్ మౌలాలి, షేక్ లాల్ అహ్మద్ గౌస్, షేక్ జానీ, షేక్ బషీర్, షేక్ పెద్దమీరా హుస్సేన్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యదర్శిపై నగదు స్వాహా ఆరోపణలు

నందిగామ రూరల్: పెద్దవరం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుకొమ్ముపాలెం సహకార సంఘం కార్యదర్శి యల్లారెడ్డి దొంగ బిల్లులతో నగదు కాజేశారనే ఆరోపణలు నెలకొన్నాయి. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సహకార సంఘం ప్రత్యేకాధికారి హర్ష కార్యదర్శిని విచారిస్తున్నట్లు తెలిసింది. రైతులు తీసుకున్న రుణాలను చెల్లించే క్రమంలో రైతులకు నకిలీ రశీదులు ఇచ్చి రైతులు చెల్లించిన రుణ నగదును తన సొంతానికి వాడుకున్నారనే అభియోగాల నేపథ్యంలో ఈ విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

నందిగామ రూరల్: సహకార సంఘాలను పటిష్ట పర్చడంతో పాటు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని మైలవరం, నందిగామ ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ చైర్మన్ మద్దుకూరి రామారావు, సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ఆర్థిక ఉన్నతిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం చైర్మన్, సభ్యులను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు కోట వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఎదురుచూపులు

పెనుగంచిప్రోలు: యూరియా కోసం రైతులు స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం పడిగాపులు పడ్డారు. రైతులు మొత్తం గుమి కూడటంతో అధికారులు పోలీస్ సిబ్బందిని పిలిపించారు. రైతుల వద్ద నుంచి పాస్‌బుక్, ఆధార్ కార్డు చూసి ఒక్కో రైతుకు ఒక్కో కట్ట మాత్రమే ఇవ్వటంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఏఓ రామసుబ్బారెడ్డి మళ్లీ యూరియా తెప్పిస్తామని, ప్రస్తుతం 220 కట్టలు పెనుగంచిప్రోలు, గుమ్మడిదుర్రుకు 300 కట్టలు వచ్చాయన్నారు. అయితే కొందరు రైతులు ఇంట్లో ఎన్ని పాస్‌బుక్‌లు ఉంటే అన్ని లైన్లో పెట్టటంతో ఒక్క ఇంట్లో 6 నుంచి 7 కట్టలు అందగా కొందరు రైతులకు ఒక్కటి కూడా అందలేదన్నారు.